క్లుప్తంగా

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవస్థానం ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల ద్వారా దేవస్థానానికి రూ.1,30,265, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.32,704తో మొత్తం రూ.1,62,965 ఆదాయం వచ్చినట్టు ఈఓ సురేష్‌బాబు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత అన్నారు. పెదపళ్ల పీహెచ్‌సీని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తున్న తీరును స్థానిక రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిసరాల పరిశుభ్రతను స్వయంగా ఆమె పరిశీలించారు. అలాగే రికార్డులను తనిఖీ చేసి వైద్యాధికారులు డి.సాయికిశోర్, కె.భాగ్యశ్రీకి పలు సూచనలు, సలహాలు అందజేశారు. సంపూర్ణ పారిశుధ్యంలో ప్రత్యేకత నిలుపుకున్న డివిజన్ పరిధిలోని ఒక పీహెచ్‌సీకి వచ్చే నెల అక్టోబర్ రెండున గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు అడిషనల్ డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్‌ఈఓ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్ ఎం.ముద్రగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



ఆలమూరులో వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

ఆలమూరు: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులందరూ ప్రభుత్వం తీసుకుంటున్న పక్షపాత వైఖరి, అనవసర యాప్‌లను తొలగించాలని కోరుతూ తమ నిరసన తెలియజేశారు. అందులో భాగంగా సచివాలయ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయా గ్రామ సచివాయాల్లో శనివారం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎ.రాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తొలుత ఆయా గ్రామ సచివాలయాల వద్ద తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తమ ఆత్మాభిమానాన్ని కాపాడాలంటూ సంతకాలు చేసిన పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని ప్రభుత్వం విడనాడకుంటే భవిష్యత్ నిరసన కార్యక్రమాన్ని ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులను వేధించడం తగదని ఆవేదన చెందారు.

నేడు విఘ్నేశ్వరుని ఆలయం మూసివేత

అయినవిల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి తలుపులను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట తరువాత మూసివేయనున్నట్లు ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు తలుపులు మూసి మర్నాడు ఆలయ వేదపండితులు, ప్రధానార్చకులు సోమవారం స్వామికి సంప్రోక్షణ పూజలు చేసిన అనంతరం ఆలయాన్ని యథావిధిగా తెరుస్తారని ఆమె తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సీనియర్ రొటేరియన్ కూచిమంచి సుధాకర్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రావులపాలెం ఎంబీ హాస్పిటల్స్ వారి ఏఎస్ఎల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఈసీజీ, బీపీ, సుగర్, యూరిక్ యాసిడ్, వివిధ రక్త పరీక్షలతో పాటు ముఖ్యంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీడీఎం) ఎముకల సాంద్రత పరీక్ష కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆయా వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. కొత్తపేట పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్ కోరారు.

ఆలమూరు డిగ్రీ కళాశాల తరలింపు

- అగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి
- గతంలో మూసివేతను అడ్డుకున్న జగ్గిరెడ్డి



ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆలమూరు: మండల కేంద్రంలో దశాబ్దకాలం క్రితం ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల మూతబడింది. విద్యార్థులు లేరనే సాకుతో మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతుంది. డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంకా కనీస సౌకర్యాల కల్పన జరగకపోవడంతో పాటు బోధనా సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడం వల్లే డిగ్రీ కళాశాలకు ఆదరణ తగ్గిందని మండల వాసులు ఆరోపిస్తున్నారు. 1978లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి సంగిత వెంకటరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలోనే 2014లో ఏర్పాటైన డిగ్రీ కళాశాల ప్రస్తుతం నడుస్తుంది. అప్పటి నుంచి డిగ్రీ కళాశాలకు సంబంధించి భవనాలు నిర్మించలేదు. కళాశాలకు అభివృద్ధి కమిటీ ఉన్నా డిగ్రీ కళాశాల అభ్యున్నతికి చేసిన కృషి మాత్రం ఏమీ లేకుండా పోయింది. డిగ్రీ కళాశాల తరలిపోవడం వల్ల తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ డిగ్రీ కళాశాలను అమలాపురం రూరల్ మండలంలోని పేరూరుకు తరలించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

డిగ్రీ కళాశాల పట్ల అంతులేని నిర్లక్ష్యం

ఆలమూరులో డిగ్రీ కళాశాల విషయంలో అభివృద్ధి కమిటీ వైఖరి 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది' అనే నానుడిని గుర్తుకు తెస్తుంది. ఈ కళాశాల ఏర్పాటు చేసిన నాటి నుంచి నిర్వహణ పట్ల అభివృద్ధి కమిటీ అంతులేని నిర్లక్ష్యం కనబరచడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. డిగ్రీ కళాశాలకు సంబంధించి భవనాలు నిర్మించేందుకు గతంలో దాతలు సమకూర్చిన స్థలం ఉన్నా, అభివృద్ధి కమిటీ వద్ద అపారమైన నిధులు ఉన్నా కళాశాల అభివృద్ధికి ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. అలాగే డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో అధ్యాపక సిబ్బందిని నియమించకోకపోవడం వల్ల విద్యార్థుల నుంచి ఆదరణ తగ్గిందని పూర్వ విద్యార్థులు చెబుతున్నారు.

అప్పట్లో తరలింపును అడ్డుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

డిగ్రీ కళాశాలలో విద్యార్థులు లేరంటూ 2023లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి ఇదే ప్రతిపాదన వస్తే అప్పటి కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అడ్డుకున్నారు. స్థానికుల మనోభావాలతో కూడిన ఈ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరుతూ అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. అదే విధంగా ప్రతిష్టాత్మక డిగ్రీ కళాశాల తరలిపోకుండా ప్రస్తుతం పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం



ఆలమూరు నుంచి డిగ్రీ కళాశాల తరలింపు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉన్నత విద్యాశాఖ నుంచి వెలువడిన అనధికార సమాచారం మేరకు కళాశాల తరలిపోతుందని భావిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలను తరలించవలసి వస్తే విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.– వి.నరసింహ స్వామి, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల, ఆలమూరు

భవిష్యత్ ప్రశ్నార్థకం



డిగ్రీ కళాశాలను మూసి వేస్తున్నారని తెలియడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాం. విద్యా సంవత్సరంలో మధ్యలో కళాశాలను తరలిస్తే తమ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ పునరాలోచన చేయాలి.

– పి.మాధురి, బీఏ సెకండియర్, ఆలమూరు

ఏకపక్ష నిర్ణయం సరికాదు



విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డిగ్రీ కళాశాలను మూసివేస్తామనడం సరికాదు. రాష్ట్ర విద్యాశాఖ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం వల్ల విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటుంది.

– ఎం.హేమమాలిని, బీఏ సెకండియర్, ఆలమూరు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



మండల సమావేశంలో డ్యామ్ సమస్యను వివరిస్తున్న జెడ్పీటీసీ అంజిబాబు

మామిడికుదురు: ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ కుసుమ వనజకుమారి సూచించారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. లూటుకుర్రులో పంట కాలువపై నిర్మించిన డ్యామ్‌కు షట్టర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. పెదపట్నం గ్రామానికి ఆర్టీసీ సర్వీసు నడపాలని సర్పంచ్ గుబ్బల దుర్గ కోరారు. మామిడికుదురు, లూటుకుర్రు గ్రామాల్లో పంట కాలువల్లో సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పైప్‌లైన్లను తొలగించాలని ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు కోరారు. ఈ పైప్‌లైన్ల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్య ఎంతో కాలం నుంచి ఉన్నా దీన్ని పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై తక్షణం స్పందించాలని కోరారు. యూరియా సమస్యను లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో యూరియా సమస్య లేదని ఏఓ సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జి.భవాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాజ్‌వేలపై తొలగని ఇబ్బందులు



అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో వాహనాల రాకపోకలు

అయినవిల్లి: వరద ఉధృతి తగ్గినా మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వేను ముంపు వీడలేదు. దీంతో కాజ్‌వేపై వరద ఇంకా ప్రవహిస్తుంది. లంక గ్రామస్తులు ఈ వరదనీటిలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామస్తులు ఈ కాజ్‌వే రహదారిపై నుంచి రాకపోకలు చేస్తారు. అయితే వారం రోజులు ముంపునీరు కాజ్‌వేపై ప్రవహించడంతో అ నీటిలోనే ప్రయాణించడం వల్ల తమకు రోగాలు ప్రబలుతాయని భయపడుతున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఈ వరద నీటిలో రాకపోకలు సాగించాలని వారు వాపోతున్నారు. ఈసారి వరద రెండు మూడు పర్యాయాలు రావడంతో ఆ కుళ్లు నీటిలోనే ప్రయాణిస్తున్నామని వారు చెబుతున్నారు. ఈ ఏడాదైనా పాలకులు కాజ్‌వే రహదారిని ఎంతు చేయడమైన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టాలని లంక గ్రామస్తులు కోరుతున్నారు. అప్పుడు ఈ సమస్య పరిష్కారం కాదని వారు చెబుతున్నారు.



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురు బిడెం కాజ్‌వేపై ప్రయాణిస్తున్న లంక గ్రామస్తులు

ఇంకా ఎన్ని రోజులో ఈ ముంపు

మామిడికుదురు: తీర గ్రామాల ప్రజలకు గోదావరి వరద కష్టాలు ఇప్పట్లో తప్పేలా లేవు. శనివారం కూడా అప్పనపల్లి కాజ్‌వేను వరద ముంపు వీడలేదు. కాజ్‌వేపై వరద ప్రవహిస్తూనే ఉంది. దీంతో వరద నీటిలోనే దిగి మూడు లంక గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి తోడు అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు సైతం ఇబ్బందులు పడ్డారు. రెండడుగుల మేర వరద నీటిలో అష్టకష్టాలు పడి రాకపోకలు సాగించారు. అయిదు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరద కష్టాల నుంచి తమకు ఎప్పటికి విముక్తి కలుగుతుందో అని మదనపడ్డారు.

మూడోసారి ప్రతిభా పురస్కారం



పాఠశాల తరఫున అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం శ్రీరామకృష్ణ

మలికిపురం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలకు ఇచ్చే క్రీడా ప్రతిభా అవార్డు 2025కుగాను గుడిమెళ్లంక పాఠశాలకు దక్కిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీరామకృష్ణ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన వివరించారు. తమ పాఠశాలకు వరుసగా మూడుసార్లు క్రీడాప్రతిభా అవార్డు దక్కిందని ఆయన అన్నారు. 2024, 2023లో కూడా అవార్డు వచ్చినట్లు ఆయన వివరించారు. పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో శనివారం వ్యాయామోపాధ్యాయుడు కె.రాధాకృష్ణ, పాఠశాల సిబ్బందిని సర్పంచ్ నల్లి విజయకుమారి, పెన్మత్స రంగరాజు, అల్లూరి గోపరాజు, ఇతర గ్రామస్తులు పాల్గొని అభినందించారు.



అంబాజీపేటలో ఉత్తమ జిల్లా, మండల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అంబాజీపేట: గురుతర బాధ్యతకు మించిన వృత్తి వేరొకటి లేదని, అందరితో గౌరవింపబడే వ్యక్తి గురువు అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవంలో భాగంగా అంబాజీపేట మండల రీసోర్స్ భవనంలో ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌ల ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం సన్మాన సభ నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఏఎల్‌వీ ప్రసాద్, సీహెచ్ శ్యామలకుమారి, కందాల గణేష్ నరసింహం, మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, కె.భూలక్ష్మి, కె.నాగశ్రీదేవి, బి.శ్రీదేవి, ఎ.మంగతాయారు, పి.రాజేశ్వరిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, వాకపల్లి దొరబాబు, వడ్లమాణి పద్మావతి, ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గురువు పాత్ర ఎనలేనిది



ప్రిన్సిపాల్‌ని సన్మానిస్తున్న ప్రముఖులు

రావులపాలెం: సమాజంలో గురువు పాత్ర ఎనలేదని వారిని గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ముఖ్యఅతిథులుగా పాల్గొని గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, చిన కేవీ, జక్కంపూడి వెంకటస్వామి పాల్గొన్నారు.

కొత్తపేట: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో గురువులు గురుతర బాధ్యులు కావాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అన్నారు. కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ రాధాకృష్ణన్ విద్యా విలువలను సమాజంలో స్థిరపరచిన గొప్ప విద్యావేత్త అని అన్నారు. ఆయన విద్యా రంగం అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. తొలినాళ్లలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన సర్వేపల్లి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించడం ద్వారా గురువులకు గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో భక్తుల రద్దీ

- గోవింద నామస్మరణతో పులకించిన కోనసీమ తిరుమల



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: వాడపల్లి వాసా.. శ్రీవేంకటేశా.. అంటూ వేల మంది భక్తుల గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం పులకించింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో శనివారం ఆలయం కిక్కిరిసింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాసరావు, అర్చకులు, వేద పండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధ సేవలు నిర్వహించారు. సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు సమీప గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించారు. భారీ క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి దర్శనం, తీర్థప్రసాదాలు స్వీకరణ అనంతరం అన్నసమారాధనలో వేలాది మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఒక్కరోజు దేవస్థానికి స్వామివారి విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, నిత్యాన్నదానం, శాశ్వత అన్నదానం, లడ్డూ ప్రసాదం విక్రయం తదితర వాటి ద్వారా రూ.63,26,814 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము వాడపల్లిలో ట్రాఫిక్‌ను నియంత్రించి బందోబస్తు పర్యవేక్షించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలు వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపాయి.

జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన ప్రాచీన దేవాలయమైన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నాలుగు శనివారాలు దర్శించుకుని నాలుగు ప్రదక్షిణల కార్యక్రమాన్ని ఆలయ కమిటీ శనివారం ప్రారంభించింది. అందులో భాగంగా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలకు చేపట్టిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఆలయాన్ని వరుసగా నాలుగు శనివారాలు దర్శించుకుని, నాలుగు ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించిన వారికి ఈతి బాధలు ఉండవన్నారు. దేవదాయశాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల పంపిణీ జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన గణపతి నవరాత్రులు



పాదలాడలో వేలంలో లడ్డూ దక్కించుకున్న వెంకటేష్



మాచవరంలో స్వామి వారి లడ్డూను వేలంలో దక్కించుకున్న మధుసంజీవ్

కొత్తపేట/మామిడికుదురు/అంబాజీపేట/సఖినేటిపల్లి/పి.గన్నవరం/ఆలమూరు/అయినవిల్లి/రాజోలు: గణపతి నవరాత్రులు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణపతి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు శివారు గాలిదేవర పాలెంలో వినాయకుని చేతిలో ఏడు కిలోల లడ్డూను శనివార అదే గ్రామానికి చెందిన నార్ని సత్యనారాయణ రూ.66 వేలకు పాడుకున్నారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ వీధిలో ఉన్న యువ గణపతి ఆలయం వద్ద స్వామి వారి లడ్డూను చొల్లంగి మధుసంజీవ్ రూ.73,100కు దక్కించుకున్నారు. నందంపూడి అమ్మవారితోటలోని యువ గణపతి ఆలయం వద్ద లడ్డూను రూ.34,500 పెచ్చెట్టి వెంకటేశ్వరరావు దక్కించుకున్నారు. సఖినేటిపల్లి మండలంలోని టేకిశెట్టిపాలెం పుష్కరఘాట్ వద్ద శనివారం చవితి మహోత్సవాల్లో చివరి ఘట్టం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను భక్తులు నిర్వహించారు. పి.గన్నవరం మండలంలో శనివారం గణేష్ నిమజ్జన కార్యక్రమాలు శనివారం జరిగాయి. గణనాథులను వశిష్ట, వైనతేయ నదీపాయల్లో నిమజ్జనం చేశారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథుడి నిమజ్జన మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆత్రేయపురం మండలం ర్యాలి గుడిమెరక వినాయక ఉత్సవ పందిరి గణపతి నిమజ్జనంలో భాగంగా వివిధ దేవతామూర్తుల వేషధారణతో ఊరేగింపు నిర్వహించారు. అయినవిల్లి మండలంలోని అయినవిల్లి, సిరిపల్లి, తొత్తరమూడి, విలస తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా జరిపారు. రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 150 గణనాథుల విగ్రహాలను వశిష్ట గోదావరిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గోదావరిలో పంటు ఏర్పాటు చేశారు. రాజోలు మండలం పాదలాడ శ్రీరామ్‌నగర్‌లో స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. 11 కేజీల బరువైన లడ్డూను వేలంలో భక్తుడు కామాడి వెంకటేష్ రూ.1,02,216కు దక్కించుకున్నారు.

సమ్మెతో దిగివచ్చిన ప్రభుత్వం

మలికిపురం: 42 రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది చేసిన సమ్మెతో ప్రభుత్వం దిగి వచ్చి పలు సమస్యలను పరిష్కరించిందని అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణవేణి, బండి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. వర్కర్ల సమస్యల పరిష్కారానికి జీవో విడుదల చేసిందని ఇరువురు పేర్కొన్నారు. మట్టి ఖర్చులతో పాటు గ్రాట్యుటీ జీవో ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గంగా రాజోలు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుజాత, జి.రత్నకుమారి, కోశాధికారిగా చింతం వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా బి.అన్నపూర్ణ, రత్నకుమారి తదితరుల ఎంపిక జరిగింది.

తొలగిన లోవోల్టేజీ సమస్య

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు కొంగలతోట ఏరియాలో ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజీ సమస్య రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ చొరవతో శనివారం పరిష్కారమైంది. గత కొద్ది కాలంగా ఈ ఏరియాలో కరెంటు లోడు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో సఖినేటిపల్లి ఏఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీనిని సర్పంచ్ మేడిద సరోజ ప్రారంభించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

అయినవిల్లి: ప్రకృతి వ్యవసాయమే మేలని అయినవిల్లి మండల వ్యవసాయ అధికారి వై.శోభ అన్నారు. శనివారం ప్రకృతి వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో అయినవిల్లిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వై.శోభ మాట్లాడుతూ రైతులందరికీ ఘన, జీవ, బీజామృతాలు, కషాయాలు, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం అగ్నిఅస్త్రం, లింగాకర్షక బుట్టలు అందుబాటులో ఉండే విధంగా ఇప్పో చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించిన షాపును అయినవిల్లిలో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అడ్డాల రాంబాబు, ప్రకృతి వ్యవసాయ అధికారులు రాధిక, అనంత కుమార్, సూరిబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ జగదీశ్వరి, దుర్గాభవాని, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తాటిపాకలో పొలం పిలుస్తోంది

రాజోలు: మండలంలోని తాటిపాకలో శనివారం ఇండిగాప్ పొలం పిలుస్తోంది భాగంగా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం తాటిపాక యూనిట్ ఇన్‌చార్జ్ పోతురాజు ప్రసన్నకుమార్, మండల ఏవో మధుతో కలసి రైతులకు ప్రకృతి వనరులు ఉపయోగించుకునే విధానాలను వివరించారు. ఇందులో భాగంగా అగ్నిఅస్త్రం తయారీ, కావాల్సిన పదార్థాలు, ఉపయోగాలు, నిల్వ సామర్థ్యం వారు తెలిపారు. ఏ విధంగా పురుగుల ఉధృతి తగ్గిస్తుందన్నది వివరించారు. అలాగే జీవన ఎరువులు వాడకం ద్వారా భూమిలో ఉన్న లభ్య భాస్వరం, లభ్య పొటాషియం, యాక్టివేట్ చేయడానికి ఎలా సహకరిస్తాయో ఏవో తెలిపారు. ప్రస్తుత తరుణంలో నత్రజని ఎరువులు కొరతకు ద్రవజీవామృతం, అజోల్లాలు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులకు ఆయన వివరించారు. వీఏఏ అబ్బాస్, ఐసీఆర్‌పీ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



విశేషాలంకరణలో నల్లచెరువు వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

చెత్త నిర్వహణపై ప్రచారం



పల్లిపాలెంలో బుర్రకథ ప్రదర్శనలో కళాకారులు

మలికిపురం: గ్రామాల్లో చెత్త నిర్వహణ, పారిశుధ్యంపై అవగాహన, ప్రజల జీవనవిధానం, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న జీవిత బీమా సౌకర్యాలపై మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో బుర్రకథ ప్రచారం నిర్వహించారు. పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీమా వల్ల కుటుంబానికి భవిష్యత్తు, ఆర్థిక భరోసా ఉంటుందని కళాకారులు బుర్రకథ ద్వారా వివరించారు. పారిశుధ్యం బాగుంటేనే పలు ఆరోగ్యం బాగుంటుందని వివరించారు. సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి పంచాయతీ కార్యదర్శి డి.జ్యోతి, వినాయక సంఘ అధ్యక్షులు కొల్లు శ్రీను, కొల్లు సుబ్బారావు, రాంబాబు, నరసింహరాజు పాల్గొన్నారు.